సాక్షి వనపర్తి

మంగళవారం, 11, ఏప్రిల్, 2023



నెరవేరని రూర్బన్ లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రూర్బన్ మిషన్ లక్ష్యం క్షేత్రస్థాయిలో నెరవేరడం లేదు.

వివరాలు 8లో ▸



ప్రజాసేవ కోసమే..

ప్రజాసేవ చేయడం కోసమే ఉద్యోగం వదులుకున్నానని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
38.2 /23.5

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం, సాయంత్రం వేళలలో ఆకాశం తేలికపాటి మేఘావృతమై ఉంటుంది.



న్యూస్‌రీల్

'పది' పరీక్షలకు 7,088 మంది హాజరు

వనపర్తి టౌన్: జిల్లాలో ఎస్సెస్సీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన పరీక్షకు మొత్తం 7,088 మంది విద్యార్థులకు 7,054 మంది హాజరుకాగా, 34 మంది గైర్హాజరైనట్లు డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రాజకీయ వేదికగా బీసీ ఆత్మగౌరవ సభ

వనపర్తి: బీసీ ఆత్మగౌరసభ పేరుతో ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమం రాజకీయ వేదికగా మారిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టుయాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు జనాభాప్రాతిపదికన రావాల్సిన అన్ని హక్కుల గురించి పోరాడుతామని, ఈ వేదికపై మంత్రిని విమర్శించడమే లక్ష్యంగా ప్రసంగాలు సరికాదన్నారు. శివయాదవ్ సంఘటనతో మంత్రికి ఎలాంటి సంబంధం లేదని, కేవలం స్థానికంగా ఉన్న వైరుధ్యాల వల్ల చోటుచేసుకున్నట్లు చెప్పారు. బీసీ వ్యతిరేకిగా మంత్రి నిరంజన్ రెడ్డిని చిత్రీకరించేందుకు ఈ బీసీ ఆత్మగౌరవసభను ఏర్పాటు చేశారని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. సమావేశంలో గ్రంథాలయాల సంస్థ చైర్మన్ బి. లక్ష్మయ్య, నాయకులు రమేష్‌గౌడ్, కురుమూర్తియాదవ్, కోళ్ల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మార్కండేయ కాల్వ పనుల అడ్డగింత

బిజినేపల్లి: మండలంలోని గంగారం గ్రామ పరిధిలో నిర్మిస్తున్న మార్కండేయ ఎత్తిపోతల పథకం కాల్వ పనులను గ్రామ రైతులు సోమవారం నిలిపివేశారు. ప్రాజెక్టులో భాగంగా కాల్వ కోసం 60 ఎకరాలు సేకరించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ఎవరెవరి భూమి ఎంత సేకరిస్తున్నారు.. వారికి ఎంత పరిహారం చెల్లిస్తారు అనే సమాచారం లేకుండా పనులు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. పరిహారం చెల్లించకుండా పనులు ఎలా చేస్తారని రైతులు నిరసన చేశారు. తమకు 2020 డీపీఆర్ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అంజిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చించి త్వరలోనే పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

● 'జూపల్లి'పై వేటు

పయనమెటు..?

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

- సీఎం కేసీఆర్‌పై ఘాటు విమర్శల ఎఫెక్ట్
- కాంగ్రెస్ గూటికా.. బీజేపీ చెంతకా.. సొంత పార్టీనా..?
- కొల్లాపూర్ నియోజకవర్గ ఇరుపార్టీల నాయకుల్లో గుబులు
- సీనియర్ నేతగా ఉమ్మడి జిల్లాపై మంచి పట్టు
- పలు సెగ్మెంట్లలో రాజకీయ సమీకరణలు మారే అవకాశం?

మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుపై బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం కన్నెర్ర చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన సమ్మేళనం వేదికగా పార్టీ వ్యవహరిస్తున్న తీరు, అధినేత, సీఎం కేసీఆర్‌పై జూపల్లి ఘాటుగా విమర్శించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆగ్రహించిన అధిష్టానం కొన్ని గంటల వ్యవధిలోనే ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. పార్టీపై విమర్శలు చేసేవారు ఎంతటి వారైనా క్రమశిక్షణ చర్యలు తప్పవనే సంకేతాలు ఇచ్చేందుకే వేటు వేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తుండగా.. తాజా పరిణామక్రమాలు హాట్‌టాపిక్‌గా మారాయి. ఈ క్రమంలో మారనున్న రాజకీయ సమీకరణలపై ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా చర్చ జోరుగా సాగుతోంది.

గ్యాప్ పెరుగుతూ..

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి జూపల్లి కృష్ణారావు ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణ ఆవిర్భావం తర్వాత టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 2018లో జరిగిన ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు అనూహ్యమైన తీర్పు ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలుపొందడం, ఆ తర్వాత ఆయన బీఆర్ఎస్‌లో చేరడంతో సీన్ ఒక్కసారిగా మారింది. కాలం గడుస్తున్నా కొద్దీ జూపల్లి, బీరం మధ్య గ్యాప్ పెరుగుతూనే వచ్చింది. ఈ నేపథ్యంలో అభివృద్ధిపై బహిరంగచర్చకు రావాలంటూ వారిద్దరి మధ్య సవాల్, ప్రతి సవాళ్లు నడిచాయి. కానీ ఎక్కడా పార్టీపై గానీ, అధిష్టానంపై గానీ జూపల్లి ప్రత్యక్షంగా, పరోక్షంగా విమర్శలు గుప్పించిన దాఖలాలు లేవు.



నేను సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక సస్పెండ్ చేశారు. చాలా సంతోషం. తప్పు జరిగినప్పుడు ఏ పార్టీలో ఉన్నా ప్రశ్నిస్తా. తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేశాను. వెయ్యి కోట్లు ఇచ్చినా నన్ను కొనలేరని చెప్పా. ఈ ప్రభుత్వం మూడోసారి పరిపాలించే నైతిక అర్హత కోల్పోయింది. ప్రజలను మభ్యపెట్టడం కరెక్ట్ కాదు. రుణమాఫీ, డబుల్ బెడ్‌రూం, దళితబంధు ఇందుకు ఉదాహరణలు. నా ప్రశ్నలకు కేసీఆర్ జవాబివ్వాలి.

– జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి

సిట్టింగులకే సీటు అని తేల్చడంతో..

మొయినాబాద్ ఫాంహౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో కొల్లాపూర్ ఎమ్మెల్యే ఉండడంతో నియోజకవర్గంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఎమ్మెల్యే నెలరోజులుగా కనిపించడం లేదని పోస్టర్లు వెలియడం, పోలీసులకు ఫిర్యాదు వంటి అంశాలు అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారాయి. అయితే ఫాంహౌస్ కేసులో ఎమ్మెల్యేలను సీఎం కేసీఆర్ ఆణిముత్యాలుగా పేర్కొనడం.. సిట్టింగ్‌లకే మళ్లీ సీట్లు ఇస్తామని చేసిన ప్రకటన జూపల్లితో పాటు ఆయన వర్గీయులను కలవరానికి గురిచేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కృష్ణారావు తన పంథాను మార్చుకున్నట్లు సమాచారం.

ఊహాగానాల వెల్లువ..

జూపల్లిపై వేటు నేపథ్యంలో ఆయన సొంతగూడు కాంగ్రెస్‌లో చేరతారా? బీజేపీలోకి వెళ్తారా? లేదంటే కొత్త పార్టీ పెడతారా? అనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఏ పార్టీలోకి వెళ్లనని.. కొత్త పార్టీ పెట్టే ఆలోచన లేదని జూపల్లి ఖండించారు. తగిన సమయం కోసం వేచిచూస్తున్నట్లు ఆయన చెబుతున్నప్పటికీ.. రాజకీయ వర్గాల్లో మాత్రం చర్చ జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న నేతల్లో గుబులు నెలకొంది. సుదీర్ఘ కాలం రాజకీయ అనుభవంతో ప్రజాప్రతినిధిగా పనిచేసిన జూపల్లికి ఉమ్మడి జిల్లాపై మంచి పట్టు ఉంది. కొల్లాపూర్, అచ్చంపేట, గద్వాల, అలంపూర్‌తో పాటు దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఆయన అభిమానులు ఉన్నారు. ఆయన తీసుకునే నిర్ణయాన్ని బట్టి పలు సెగ్మెంట్లలో రాజకీయ సమీకరణలు మారే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

తాను అనుకున్నట్లే అయ్యిందా..

ఎన్నికలకు ఇంకా ఆరు నెలల సమయం మాత్రమే ఉండడం.. ఇప్పుడైనా సరైన నిర్ణయం తీసుకోకపోతే అసలుకే మోసం వస్తుందని భావించిన జూపల్లి ఇందుకనుగుణంగా అడుగులు వేసినట్లు చర్చ జరుగుతోంది. తాను చేసిన ఆరోపణలతో పార్టీ వీడేందుకు రెడీగా ఉన్నట్లు సంకేతాలు పంపడం ద్వారా తన కార్యాచరణకు పదునుపెట్టినట్లు తెలుస్తోంది. తనంతట తాను పార్టీ మారితే వచ్చే మైలేజీ కంటే పార్టీ తనను సస్పెండ్ చేస్తే వచ్చే సానుభూతి వచ్చే ఎన్నికల్లో కలిసి వస్తుందని అంచనా వేసిన ఆయన సీఎం కేసీఆర్‌పైనే బాణాలు సంధించినట్లు సమాచారం. చివరకు జూపల్లి ఆశించిందే జరగడంతో ఇక తమ నేత ప్రజాక్షేత్రంలో అసలు తడాఖా చూపుతాడని ఆయన వర్గీయులు చెబుతున్నారు.

ఘాటు విమర్శలతో..

అధికార పార్టీలోని అసంతృప్త నేతలను కలుపుకుని ముందుకెళ్లేందుకు జూపల్లి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇదివరకు ఒకసారి ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ నేతలైన మాజీ ఎంపీ పొంగులేటి తదితరులతో భేటీ అయ్యారు. సీఎం కేసీఆర్ వనపర్తి జిల్లా పర్యటన రోజునే ఆయన ఖమ్మం వెళ్లడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా పొంగులేటి తన అనుచరులు, అభిమానులతో కొత్తగూడెంలో నిర్వహించిన సమ్మేళనానికి జూపల్లిని ఆహ్వానించారు. దీనికి హాజరైన ఆయన సీఎం కేసీఆర్‌లో నిజాయితీ లోపించిందని.. ఉద్యమకారులను విస్మరించారని.. ఆత్మాభిమానం దెబ్బతీస్తున్నారని.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందంటూ ఘాటుగా విమర్శలు గుప్పించారు. ఇది పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందని భావించిన అధిష్టానం పొంగులేటితో పాటు జూపల్లిని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేయండి

- పశువైద్యాధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన మేర రెండో విడత గొర్రెల పంపిణీకి ఆయాశాఖల అధికారులు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సోమవారం ఈ విషయమై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రెండో విడతలో జిల్లా పరిధిలోని లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉందని, దీనికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పశు వైద్యాధికారులు రోజువారీగా గ్రామాల్లో గొర్రెల పెంపకందారులు, సహకార సంఘ సభ్యులతో కలిసి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయాలన్నారు. లబ్ధిదారులకు సంబంధించిన కులధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డ్, నామినీ ఆధార్ కార్డ్ తదితర ధ్రువపత్రాలతో పాటు దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందన్నారు. రెండవ విడత గొర్రెల పంపిణీ కోసం పశువైద్యాధికారులు, కర్ణాటక, ఆంధ్రా, మహారాష్ట్ర మార్కెట్లకు వెళ్లి గొర్రెలను కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో 11,961 మంది లబ్ధిదారులు రెండో విడత కోసం వేచి ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

విగ్రహావిష్కరణకు 300మంది తరలివెళ్లాలి

ఈనెల 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహేబ్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఆవిష్కరించనుండగా జిల్లా నుంచి 300 మందికి తగ్గకుండా వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతి మండలం నుంచి ఒక బస్సు ఏర్పాటు చేసి ప్రతి బస్సుకు ఒక లైజన్ అధికారిని కేటాయించాలని, వెళ్లే వారికి టిఫిన్, మధ్యాహ్నం, రాత్రికి భోజనం, తాగునీటి వసతి ఏర్పాట్లు లైజన్ అధికారే చూసుకోవాలన్నారు. ఒరోజు ముందు కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, ఇతర జిల్లాల అధికారులతో కోఆర్డినేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



హాజరైన ఆయా ప్రభుత్వశాఖల అధికారులు

'ప్రజావాణి' అర్జీలు సత్వరం పరిష్కరించాలి

ప్రజావాణి అర్జీలపై ఆయాశాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి డీఆర్‌డీఓ నర్సింహులు, జెడ్పీ సీఈఓ శ్రావణ్‌కుమార్‌తో కలిసి ప్రజల నుంచి వచ్చిన మొత్తం 80 అర్జీలు కలెక్టర్ స్వీకరించారు. ప్రజా సమస్యలను నేరుగా విని సంబంధిత శాఖ అధికారులకు పరిష్కారం కోసం సిఫారస్ చేశారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 5 ఫిర్యాదులు

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 5 ఫిర్యాదులు వచ్చాయి. ఆయా మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు ఎస్పీ రక్షిత కె మూర్తికి వినతులు సమర్పించారు. భూ తగాదాలు, భార్యాభర్తల ఫిర్యాదులు, పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు రాగా.. వీటిని పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యపర్చాలని.. అలాగే రాష్ట్ర ప్రభుత్వ కుట్రలను వివరించి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచెయ్యాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్ పట్టణంలో సోమవారం ఉమ్మడి మండలాల బూత్ సశక్తి కరణ్‌లో భాగంగా శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, బూత్‌కమిటీ అధ్యక్షుల సమావేశం నిర్వహించగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోందని, నిరుద్యోగులు ఉద్యోగాలు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు కేంద్ర నిధులను వినియోగిస్తు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు ఇవ్వడం లేదని విమర్శలు చేయ్యడం బీఆర్ఎస్ పాలకులు మానుకోవాలని సూచించారు. దేశాభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలోనూ బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చే విధంగా కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ బోసుపల్లి ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదవ్, అసెంబ్లీ కో కన్వీనర్ రేచింతల శ్రీనివాస్, ఆత్మకూర్ టౌన్ అధ్యక్షుడు తమ్మలి విజయ్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి

మెరుగైన వైద్య సేవలు అందించాలి



పాన్‌గల్ పీహెచ్‌సీలో గర్భవతిని పరీక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాసులు

పాన్‌గల్: పీహెచ్‌సీలలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యం, ఆరోగ్య కార్యక్రమాలు, కాన్పులపై ఆరా తీయడంతోపాటు వైద్యం కోసం వచ్చిన గర్భవతులను పరీక్షించారు. కరోనా వ్యాధిపై అప్రమత్తంగా ఉంటూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వ్యక్తిగత పరిశుభ్రతను తప్పక పాటించాలన్నారు. ఇదిలాఉండగా, స్థానిక రైతు వేదికలో మండలంలో పనిచేసే అన్ని శాఖల సిబ్బందికి గుండె సంబంధిత సీపీఆర్ శిక్షణపై డా.హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైన సమయంలో ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా సీపీఆర్‌ను ఏవిధంగా చేయాలనే విషయాలను అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ పర్యవేక్షించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, ఆరోగ్య, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాకీల్లో వణుకు..!

- ఎస్పీ వరుస పర్యటనలతో హడల్
- విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఎస్ఐలకు చార్జ్ మెమోలు జారీ
- కేసుల్లో తలదూర్చుతున్నారని మరో ముగ్గురిపై సస్పెన్షన్ వేటు

వనపర్తి: ఎస్పీగా రక్షిత కె.మూర్తి బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే ఆ శాఖలో చెప్పుకోదగిన మార్పు కనిపిస్తోంది. ప్రజలతో మమేకమై వారితో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకొనేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వటంతో చాలా విషయాలు ఆమె దృష్టికి వస్తున్నట్లు తెలుస్తోంది. మొదట ఇల్లు (సొంత శాఖ) చక్కదిద్దే పనిలో నిమగ్నమయ్యారన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీనికితోడు.. వరుసగా పోలీస్‌స్టేషన్ల తనిఖీలు, సీసీని సైతం మార్చటం, విధుల్లో నిర్లక్ష్యం, కేసులను పెండింగ్‌లో ఉంచడం, రికార్డుల నిర్వహణలో లోపాలను పరిశీలిస్తూ ఎస్ఐలకు చార్జ్‌మెమోలు జారీ చేయడం.. మొత్తంగా జిల్లాలో పోలీసు వ్యవస్థను గాడిలో పెట్టేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. చేయాల్సిన విధులను పక్కనపెట్టి పంచాయితీలు చేస్తూ.. సొంత లాభం కొంత మేలు అనుకునేవారికి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. అయినా కొందరు ప్రబుద్ధులు మా విషయాలు ఉన్నతాధికారులకు ఎలా తెలుస్తాయిలే అన్న నిర్లక్ష్య ధోరణి అలుముకోవటం జిల్లా కేంద్రమైన వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్‌లోని ముగ్గురిపై సస్పెన్షన్ వేటుకు దారితీసినట్లు తెలుస్తోంది. సస్పెండ్ అయిన ముగ్గురిలో ఇద్దరు గత కొన్నేళ్లుగా.. టౌన్ స్టేషన్‌లో పాతుకుపోయి స్టేషన్‌కు వచ్చే వారిని చెట్టుకిందకు తీసుకువెళ్లి ఏంటని మీ ఫిర్యాదు మేము పరిష్కరిస్తామంటూ.. వ్యవహారం నడిపించిన ఘటనలు చాలానే ఉన్నాయి. ఇటీవల ఓ మైనర్ బాలిక కేసు విషయంలోనూ.. ఆ ఇద్దరు జోక్యం చేసుకోవడం, ఈ విషయంపై ప్రజావాణిలో ఎస్పీకి ఫిర్యాదు అందడంతో విచారణ చేసి మొదట వారిని హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేశారు. విచారణ పూర్తయ్యాక వారితో పాటు ఆ కేసులో జోక్యం చేసుకున్న మరో కానిస్టేబుల్‌తో కలిసి ముగ్గురిపై సస్పెండ్ వేటువేయటం పదిరోజుల వ్యవధిలోనే.. చక చకా జరిగిపోయాయి.

➡ 2023 ఫిబ్రవరి 28న పెద్దమందడి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి విధుల పట్ల నిర్లక్ష్యం, రికార్డుల నిర్వహణ లోపం, కేసుల విచారణ సక్రమంగా చేయటం లేదని చార్జ్ మెమో జారీ చేశారు.

➡ ఈ ఏడాది మార్చి 3న గోపాల్‌పేట, రేవల్లి పోలీస్‌స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ పెండింగ్ కేసులు, రికార్డుల నిర్వహణ లోపాన్ని గుర్తించి చార్జ్ మెమో జారీ చేశారు.

➡ మార్చి 19న వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ ఏఎస్ఐ, ఓ కానిస్టేబుల్‌ను ఓ ప్రైవేటు పంచాయితీలో జోక్యం చేసుకున్నారని హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు.

➡ మార్చి 7న ఓ మైనర్ బాలిక కేసు విషయంలో జోక్యం చేసుకున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై విచారణ అనంతరం ఒక ఏఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ డీఐజీ చౌహాన్ ఆదేశాలు జారీ చేశారు

➡ ముగ్గురి సస్పెన్షన్ రోజే వనపర్తి టౌన్ ఎస్ఐకి కూడా చార్జ్ మెమో జారీ అయ్యింది.



పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ (ఫైల్)

తర్వాత ఎవరి వంతు..?

అవినీతి అక్రమాలకు అలవాటుపడిన మరికొందరిపై ఇప్పటి వరకు రహస్య విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ముగ్గురిపై సస్పెన్షన్ వేటు పడడంతో తర్వాతి వంతు ఎవరిదో అంటూ.. పోలీసులు చర్చించుకుంటున్నారు. మారుమూల ప్రాంతమైన చిన్నంబావి పోలీస్‌స్టేషన్‌ను సైతం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీలు చేయటం, ప్రజల్లో పోలీస్ శాఖపై సన్నగిల్లిన నమ్మకాన్ని పెంపొందిస్తోంది. ఫిర్యాదులిచ్చేందుకు వచ్చిన వారిని రాబందుల్లా పీక్కుతినేవారిపై చర్యలు తీసుకుంటూనే అవినీతిపరులు, అక్రమార్కులపై నిఘా ఉంచినట్లు సమాచారం. ఏళ్లుగా.. ఇష్టానుసార విధులకు అలవాటుపడిన కొందరు అవినీతిపరులైన పోలీసులకు ఎస్పీ వ్యవహారశైలితో వణుకు పుడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇంకా ఇద్దరిపై విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తారా.. లేక మిగతా ముగ్గురిలా సస్పెండ్ చేస్తారా అనే విషయంపై జిల్లా పోలీస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



ఆపద సమయంలో ఎవరు ఫోన్ చేసినా ప్రధానంగా మహిళల ఫిర్యాదుల్లో పోలీసులు స్పందించి వారికి న్యాయం జరిగేలా చూడాలి. అప్పుడే పోలీసులపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. ప్రజల శ్రేయస్సు కోసం పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి న్యాయం జరిగేలా చూస్తారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.

– రక్షిత కె మూర్తి, ఎస్పీ

బోదకాలు వ్యాధి నివారణే లక్ష్యం

అమరచింత: బోదకాలు (ఫైలేరియా) వ్యాధి నివారణే లక్ష్యమని.. చిన్నారుల్లో ఈ వ్యాధి లక్షణాలు ఏమైనా ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని మలేరియా జిలా అధికారి శ్రీనివాస్, వైద్యాధికారి శరత్ అన్నారు. ఆత్మకూర్ మండలం ఆరేపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఒకటి, రెండు తరగతుల విద్యార్థుల రక్త నమూనాలు సేకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఫైలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా ఫైలేరియా వ్యాధి వ్యాప్తి తీవ్రతను గుర్తించే ట్రాన్స్‌మిషన్ అసెస్మెంట్ సర్వే నిమిత్తం ప్రతి పాఠశాలకు వెళ్లి ఒకటి, రెండు తరగతులు చదివే విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సర్వే ద్వారా సమాజంలో ఫైలేరియా వ్యాధి ఏ స్థాయిలో ఉందో తెలుసుకునే అవకాశం ఉందని, ఐదురోజుల్లో 151 మంది విద్యార్థుల నుంచి నమూనాలు సేకరించామని, వీరందరికి నెగిటివ్ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రాజు, సురేందర్ గౌడ్, శ్రీనివాసులు, హైమావతి పాల్గొన్నారు.



చిన్నారికి రక్త పరీక్ష చేస్తున్న వైద్యాధికారి శరత్

క్లుప్తంగా

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

కేటీదొడ్డి: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు ఇలా.. గట్టు మండలం ఆలూర్‌కు చెందిన కుర్వ దుబ్బన్న(75) మతిస్థిమితం లేక పోవడంతో హనుమాన్ జయంతి రోజు సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో వెతకగా, ఎక్కడా ఆచూకీ లభించలేదు. సోమవారం కేటీదొడ్డి శివారులో పొలం వద్ద అపస్మారక స్థితిలో పడి మృతిచెంది ఉండటంతో గమనించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతిడి కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

భూత్పూర్: మండలంలోని కర్వెనకు చెందిన హరిజన వెంకటేష్(19) ఆదివారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కర్వెనకు చెందిన హరిజన వెంకటేష్ అదే గ్రామానికి చెందిన మిద్దింటి ఆనంద్‌తో కలిసి మోటర్ సైకిల్‌పై అదివారం సాయంత్రం భూత్పూర్ నుంచి కర్వెనకు వెళ్తుండగా, ఏకులగట్టు స్టేజీ వద్ద మోటార్ సైకిల్ అదుపుతప్పి పడటంతో వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదే రోజు అర్ధరాత్రి మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి సోదరుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం

చిన్నంబావి: ప్రమాదవశాత్తు బైకు అదుపు తప్పి ఓ వ్యక్తి మరణించాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. చిన్నంబావి మండలం కొప్పునూరు గ్రామానికి చెందిన పసుల కుర్మయ్య(43) గత రాత్రి చిన్నంబావి మండలంలోని వెలుగొండ గ్రామానికి తన సొంత పనుల కోసం వెళ్లాడు. తిరిగి వస్తుండగా మియాపూర్‌తండా క్రాస్ రోడ్డుకు సమీపంలో అదుపుతప్పి కిందపడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

డీసీఎంను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- 10మంది ప్రయాణికులకు గాయాలు

జడ్చర్ల: ముందు వెళ్తున్న డీసీఎంను వెనుక నుంచి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు 10మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఏపీలోని బనగానపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్‌కు వెళ్తుండగా, జడ్చర్ల మండలం బూరెడ్డిపల్లి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదం చోటుచేసుకుంది. ముందు వెళ్తున్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టగా ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన ప్రయాణికులను 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగతా ప్రయాణికులను ఇతర బస్సులో హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.

వేరుశనగ @ రూ.7,570

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వేరుశనగకు గరిష్టంగా రూ.7,570, కనిష్టంగా రూ.4,289 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్న గరిష్టంగా రూ.2,046, కనిష్టంగా రూ.1,601, జొన్నలు రూ.4,725, పెసర్లు రూ.7,060, కందులు గరిష్టంగా రూ.7,429, కనిష్టంగా రూ.4,000, పొద్దుతిరుగుడు రూ.4,240, ఉలువలు రూ.5,016, మినుములు గరిష్టంగా రూ.7,510, కనిష్టంగా రూ.6,929, ఆముదాలు రూ.6,034, కనిష్టంగా రూ.4,949, ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ రకం రూ.1,801, హంస రకం రూ.1,826, రాగులు రూ.3,019, కందులు గరిష్టంగా రూ.7,799, కనిష్టంగా రూ.7,659, పెబ్బర్లు రూ.5,069, కానుగ పలుకులు రూ.3702 ధరలు లభించాయి.

- దేవరకద్ర మార్కెట్‌లో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 2,082, కనిష్టంగా రూ.1810, హంస ధాన్యం గరిష్టంగా రూ.1,789, కనిష్టంగా రూ.1,511, ఆముదాలు గరిష్టంగా రూ.5,859, కనిష్టంగా రూ.5,709 ధరలు లభించాయి. సోనామసూరి మూడు వేల బస్తాలు, హంస 500 బస్తాలు, ఆముదాలు 500బస్తాలు అమ్మకానికి వచ్చాయి.

నెరవేరని రూర్బన్ లక్ష్యం


సల్కర్‌పేట్‌లో పనిచేయని లైట్లు

- రూర్బన్ పథకం కింద వీధుల్లో ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- పంచాయతీలపై అదనపు భారం

గండేడ్: అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కాంట్రాక్టర్లు లబ్ధి చెందితే తప్పిస్తే, లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. ఇందుకు నిదర్శనం గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లే నిదర్శనం. వివరాల్లోకి వెళితే శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ కింద గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లోని 15 పంచాయతీల్లో ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ పథకం కింద రూ.54,95,505 మంజూరు చేశారు. ఈ నిధులతో 2019 డిసెంబరులో 20 వాట్స్ వీధి లైట్లు 1,823, 75 వాట్స్ వీధిలైట్లు 78ని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన నాటి నుంచి 5 ఏళ్ల వరకు మరమ్మతు చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌దే. నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, చర్యలు తీసుకోవాలి. కానీ అది ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు.

కన్నెత్తి చూడని కాంట్రాక్టర్లు..

ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేసి మూడున్నరేళ్లకు పైగా గడుస్తున్నా ఏనాడు మరమ్మతు చేసిన దాఖలాలు లేవు. ప్రతి మూడు, ఆరు నెలలకోసారి అవి కాలిపోతూనే ఉన్నాయి. దీంతో గ్రామాల్లో అంధకారం అలుముకుంటుంది. ఎలాగైనా వాటిని మరమ్మతు చేయిద్దామంటే పంచాయతీ కార్యదర్శులు ఆ బాధ్యత తమది కాదంటూ దాటవేస్తున్నారు. కాలిపోయిన వాటి స్థానంలో కొత్తవి బిగించకపోతే గ్రామస్తులు సర్పంచ్‌లను నిలదీస్తున్నారు.


కొండాపూర్‌లో మూలనపడ్డ లైట్లు

గతంలో ఈపథకం కింద లైట్లను బిగించే సమయంలో మాత్రం లెక్క తేడా లేకుండా బిగించి వాటిదగ్గర ఫొటోలు దిగి అప్‌లోడ్ చేశారు. ప్రతి పంచాయతీలో 50 నుంచి 100 వరకు లైట్లు చెడిపోయి మూలనపడ్డాయి. ఈ విషయాన్ని పలుమార్లు సర్పంచ్‌లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. సాధారణ సమావేశాల్లో సైతం చర్చించారు. కానీ ఫలితం లేదు.

పంచాయతీలపై అదనపు భారం..

అసలే పంచాయతీలు ఆర్థిక భారంతో సతమతమవుతున్నాయి. ఓ వైపు పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, ట్రాక్టర్లకు డీజిల్, కిస్తులు కట్టడం, కరెంటు బిల్లులు చెల్లించడానికే సర్పంచ్‌లు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ సమయంలో వీధిలైట్లు ఏర్పాటు చేయడం వీరిపై అదనపు భారం పడుతుంది. ప్రతి మూడు, ఆరునెలలకు, పండుగలకు వీధి లైట్లు వేయక తప్పడం లేదు. ప్రతి సారీ కొత్తవి తెచ్చి వేస్తున్నారు. రూ.55లక్షల ప్రజాధనం వృథా అయ్యింది. మళ్లీ పంచాయతీల లైట్ల కోసం ఖర్చు చేయాల్సి వస్తుంది.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..



లైట్లు ఏర్పాటు చేసిన ఆరు నెలల వరకు బాగానే ఉన్నాయి. తర్వాత కొన్ని పాడవుతూ వచ్చాయి. వాటిని మరమ్మతు చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌దే. ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదు. కొంతకాలం ప్రైవేట్ వారితో మరమ్మతు చేయించాం. ఆ బిల్లు పెట్టుకోవడానికి కార్యదర్శులు ఆ బాధ్యత తమది కాదంటున్నారు. దీనిపై ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు.

– జితేందర్‌రెడ్డి, సర్పంచ్, సల్కర్‌పేట్

రావడమే మానేశారు..



మొదట్లో కొన్ని రోజులు చెడిపోయిన లైట్లను బాగుచేశారు. అది కూడ లైట్‌కు రూ.250 చొప్పున తీసుకునేవారు. రెండేళ్ల తర్వాత వారు రావడమే మానేశారు. అధికారులు ఇచ్చినా నంబర్‌కు ఫోన్ చేస్తే ఎత్తడం లేదు. మేమే కొత్తవాటిని తెచ్చి బిగిస్తున్నాం. మొత్తం 170 లైట్లు ఉండగా ప్రస్తుతం కూడా 30కిపైగా పని చేయడం లేదు.

– చంద్రకళ, సర్పంచ్, గండేడ్

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం..

రెండేళ్లుగా గ్రామాల్లో రూర్బన్ కింద ఏర్పాటు చేసిన లైట్లు ఎక్కువగా పాడయ్యాయి. వీటిని మరమ్మతు చేయాలని సదరు కాంట్రక్టర్‌కు లెక్కలేనన్ని సార్లు చెప్పాం. అయినా స్పందించలేదు. ఉన్నతాధికారులకు కూడా చెప్పాం. చివరకు కలెక్టర్‌కు, పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి కూడా చెప్పాం.

– శంకర్‌నాయక్, ఎంపీఈఓ, గండేడ్

అంతుచిక్కని యువతి ఆచూకీ



మన్ననూర్: నల్లమల అటవీ ప్రాంతంలోని సలేశ్వరం జాతరలో తప్పిపోయిన యువతి కోసం రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపడుతున్నా ఆచూకీ లభించలేదని మన్ననూర్ ఎఫ్ఆర్‌ఓ ఈశ్వర్ తెలిపారు. సలేశ్వరం జాతర కోసం గురువారం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన కర్ణాటకకు చెందిన యువతి గాయత్రి కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయింది. ఈ క్రమంలో పరిసర ప్రాంతం అంతా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది సుమారు 40- 50 మంది చొప్పున మూడు రోజులుగా అటవీ ప్రాంతమంతా గాలించినా ఆచూకీ దొరకలేదని చెప్పారు. దీంతో యువతి ఏమై ఉంటుందని అధికారులు పలు విధాలుగా సమాలోచనలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

వ్యవసాయ పరికరాలు దగ్ధం


మంటల్లో కాలిపోతున్న వ్యవసాయ పరికరాలు

లింగాల: మండలంలోని శాయిన్‌పేట శివారులోని వ్యవసాయ పొలంలో ఆకస్మాత్తుగా చెలరేగిన మంటల్లో వ్యవసాయ పరికరాలు, వేరుశనగ విత్తనాలు దగ్ధమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు తవిటి చిన్న నర్సింహా పొలం సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వచ్చిన నిప్పురవ్వలు చెలరేగి ఎండుగడ్డిపై పడడంతో భారీగా నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు. గుడిసె, 100 స్ప్రింక్లర్ పైపులు, 25 నల్లాలతో పాటు గుడిసెలో ఉన్న 2క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు, వంట సామగ్రి కాలిపోయినట్లు రైతు వాపోయాడు. ప్రభుత్వపరంగా ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని తహసీల్దార్ మునిరొద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు.

ఉద్యమంతోనే కనీస పెన్షన్ పెంపు సాధ్యం

- జాతీయ సంఘర్షణ సమితి ప్రధాన కార్యదర్శి సామ రాంరెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామ రాంరెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: జాతీయ సంఘర్షణ సమితి ఉద్యమంతోనే ఈపీఎస్ పెన్షనర్ల కనీస పెన్షన్ రూ.7500 సాధిస్తామని సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామరాంరెడ్డి అన్నారు. స్థానిక పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఈపీఎస్ పెన్షనర్లకు సంబంధించి రూ.15లక్షల కోట్ల నిధులు నిల్వ ఉంటే కనీస పెన్షన్ పెంచకపోవడం శోచనీయమన్నారు. పెన్షన్ పెంపునకు ఉద్యమమే శరణ్యమని అన్నారు. కనీస పెన్షన్ పెంపుదల కోసం ఈనెల 29న చలో హైదరాబాద్ చేపడుతామని, సుందరయ్య విజ్ఞాన భవన్‌లో నిర్వహించే భారీ బహిరంగసభకు సమితి జాతీయ అధ్యక్షుడు అశోక్ రావత్ పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు, నాయకులు గోవిందరాజులు, సుబ్బయ్య, చంద్రశేఖర్‌రావు, భగవంతు, నారాయణ, ఉమేష్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడ రేషన్ షాప్‌ను సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ విష్ణుప్రియ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్‌షాప్‌లో 15 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉండటంతో రేషన్‌డీలర్ సేవ్యాపై కేసు నమోదు చేసినట్లు డీటీ విష్ణుప్రియ తెలిపారు. రేషన్‌కార్డులో ఉన్న ఒక్కో కుటుంబ సభ్యుడికి 6 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉండగా 5 కిలోలు మాత్రమే ఇచ్చాడని గ్రామస్తులు ఆమెకు ఫిర్యాదు చేశారు. గతంలో సైతం ఈ రేషన్ డీలర్‌పై గ్రామస్తులు ఫిర్యాదు చేశారన్నారు. డీటీతో ఆర్‌ఐ ఖదీర్ తదితరులున్నారు.

ఆరుగురు బైండోవర్

వెల్దండ: మండలంలోని రాచూర్‌తండా, పోషమ్మ గడ్డతండాకు చెందిన ఆరుగురు నాటుసారా తయారు చేస్తూ పట్టుబడగా, సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్ ఎదుట ఎక్సైజ్ ఎస్‌ఐ వెంకటేష్ బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. రాచూర్‌తండాకు చెందిన పాత్లావత్ పద్మ అనే మహిళ రెండోసారి నాటుసారా విక్రయిస్తు పట్టుపడడంతో రూ.50వేల జారిమానా విధిస్తున్నట్లు తెలిపారు. ఏడు రోజుల్లో జారిమానా చెల్లించాలని నోటీస్ ఇచ్చి బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది మహేష్ తదితరులు ఉన్నారు.

ఒండ్రుమట్టి తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: కృష్ణానది నుంచి ఒండ్రుమట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఇటిక్యాల ఎస్‌ఐ గోకారి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మండలంలోని బి.వీరాపురం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా టిప్పర్ ద్వారా గద్వాల మండలంలోని వీరాపురం సమీపంలో గల ఇటుక బట్టీలకు ఒండ్రుమట్టిని అక్రమంగా తరలిస్తుండగా ఎర్రవల్లి కూడలి సమీపంలో టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

నవాబుపేట: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లోకిరేవులో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొన్ని నెలలుగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కోళ్లపడకల్‌కు చెందిన గుగ్గిళ్ల వినోద్(40) పాత బట్టలతో బొంతలు కుట్టుకుని వాటిని అమ్మి లోకిరేవులోని బస్టాండ్‌లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం భార్య స్వప్నతో తాగిన మైకంలో గొడవపడి మనస్తాపం చెందిన లోకిరేవు పెద్ద చెరువు సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్యహత్యకు పాల్పడ్డాడు. సోమవారం అటుగా వెళ్తున్న పశువుల కాపరులు చూసి గ్రామస్తులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

ప్రజలకు ప్రాణాల మీదకు..

- చోద్యం చూస్తున్న ఆబ్కారీ శాఖ
- జనరల్ ఆస్పత్రిలో మరో నలుగురు అడ్మిట్.. ఒకరి పరిస్థితి విషమం

మహబూబ్‌నగర్ క్రైం: తాగేవారు ఎక్కువ.. చెట్ల నుంచి వచ్చేది తక్కువ. ఇలాంటి పరిస్థితిలో వ్యాపారులు వందలాది మందికి కల్లుసీసాలు ఎలా తయారు చేస్తున్నారు.. ప్రతి ఒక్కరికి వచ్చే సందేహం ఇది. ఏముంది.. మత్తు పదార్థాలైనా ఆల్ఫాజోలం, డైజోఫాంలతోపాటు కుంకుడు కాయలు, వైట్‌పేస్ట్‌లతో తయారు చేసి సీసాల్లో పోసి విక్రయాలు జరుపుతున్నారు. ఇలా తయారు చేసిన కల్తీ కల్లు తాగుతూ ప్రజలు ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం మహబూబ్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోతీనగర్, కోయనగర్, దొడ్డలోనిపల్లికి చెందిన పది మంది కల్లు తాగడంతో తీవ్ర అస్వస్థకు గురవడంతో జనరల్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఇందులో ఒక మహిళ ప్రస్తుతం ఆస్పత్రిలోనే చికిత్స పొందుతుంది. ఈ ఘటన మరవక ముందే తాజాగా సోమవారం ఏనుగొండ, అంబేద్కర్‌నగర్ ఇతర ప్రాంతాలకు చెందిన మరో 8 మంది కల్లు తాగి అస్వస్థతకు గురికావడం కలకలం రేపుతోంది. వీరిలో ఐదుగురు చికిత్స తీసుకుని ఇంటికి వెళ్లగా.. మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందులో పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన 28 ఏళ్ల విష్ణుబాబు కల్లు తాగడం వల్ల తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలోని ఐసీయూ అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నారు. సదరు యువకుడి కుటుంబ సభ్యులతో ఓ కల్లు దుకాణం నిర్వాహకులు బేరసారాలు జరిపినట్లు తెలుస్తోంది. మధ్యవర్తులను ఆస్పత్రితోపాటు ఇంటికి పంపించి పలు దఫాలుగా చర్చలు జరిపారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా దొడ్డలోనిపల్లి, తిమ్మసానిపల్లి, బోయపల్లి ప్రాంతాల్లోని దుకాణాల్లో కల్లు తాగిన వారే అధికంగా అస్వస్థతకు గురవుతున్నారు. ఈ విషయమై మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వీరారెడ్డిని వివరణ కోరగా ఇప్పటికే రెండుసార్లు దొడ్డలోనిపల్లి, బోయపల్లి, తిమ్మసానిపల్లి కల్లు దుకాణాల్లో శాంపిల్స్ సేకరించామన్నారు. కల్లులో కల్తీ ఉన్నట్లు ల్యాబ్ నుంచి వచ్చే నివేదికలో తేలితే సదరు దుకాణాల లైసెన్స్ రద్దుతోపాటు వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.

చెంచు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల్లో ప్రవేశం కోసం చెంచు విద్యార్థులు దరఖాస్తు చే సుకోవాలని టీడబ్ల్యూ గురుకులం ప్రాంతీయ సమన్వయ అధికారి కె.నాగార్జునరావు ఒక ప్రకటనలో సూచించారు. 2023–24 కుగాను మన్ననూరులోని టీటీడబ్ల్యూయూఆర్‌జేసీ (పీటీజీ- బీ) లో మూడో తరగతి ప్రవేశానికి 80 సీట్లు, నాలుగో తరగతిలో 60, ఐదో తరగతిలో 44, ఆరో తరగతిలో 56, ఏడో తరగతిలో 38, ఎనిమిదో తరగతిలో 50, తొమ్మిదో తరగతిలో 28 ఇలా మొత్తం 356 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇక అచ్చంపేటలోని టీటీడబ్ల్యూఆర్‌ఎస్ (పీటీజీ-జీ) లో ఐదో తరగతి ప్రవేశానికి 80, ఆరో తరగతిలో 35, ఏడో తరగతిలో 24, ఎనిమిదో తరగతిలో 19 ఇలా మొత్తం 158 సీట్లు ఉన్నయని వివరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన చెంచు విద్యార్థులు వచ్చే నెల 20వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఎంపికైన వారికి ఉచిత వసతి, భోజనం, నోటు పుస్తకాలు, బెడ్స్, దుస్తులు అందజేస్తామని, పూర్తి వివరాలకు మన్ననూర్‌లోని ప్రిన్సిపాల్ (సెల్ నం. 9490957314), అచ్చంపేటలోని ప్రిన్సిపాల్ (సెల్ నం. 8333925372)ను సంప్రదించవచ్చని తెలిపారు.

కల్తీ కల్లు విక్రయాలు జరగలేదు

- తనిఖీల కోసం ప్రత్యేకంగా రెండు టీంలు ఏర్పాటు
- ఇప్పటికే స్పాట్ టెస్ట్‌లతో పాటు శాంపిల్స్ సేకరణ
- తప్పుచేసినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తప్పవు: ఈఎస్ సైదులు


మాట్లాడుతున్న ఈఎస్ సైదులు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రానికి చెందిన కొందరు కల్లు తాగి అస్వస్థతకు గురయ్యారని, ఈ నెల 7వ తేదీన పది మంది, 9వ తేదీన ఎనిమిది మందికి అస్వస్థత కలిగితే వీరికి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించామని మహబూబ్‌నగర్ ఎక్సైజ్ శాఖ ఈఎస్ సైదులు తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో ముగ్గురు చికిత్స పొందుతున్నారని, మిగిలిన వారు అందరూ వెళ్లిపోయారని తెలిపారు. ఇంద్రజ అనే మహిళకు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు పేర్కొన్నారు. క్రమం తప్పకుండా కల్లుతాగే అలవాటు ఉన్న వారు రెండు మూడు రోజులు విరామం ఇచ్చి తాగితే కొన్ని ఆరోగ్య సమస్యలు వస్తున్నట్లు చెప్పారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పాటు రెండు రోజుల పాటు విరామం ఇచ్చి తాగడం వల్ల వింతగా ప్రవర్తిస్తున్నట్లు తెలిపారు. ఎవరికి కూడా ప్రాణపాయం లేదన్నారు. కల్లు దుకాణాల్లో స్పాట్ టెస్ట్‌లతో పాటు శాంపిల్స్ సేకరించడానికి రెండు ప్రత్యేక టీం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బోయపల్లి, దొడ్డలోనిపల్లి, తిమ్మాసనిపల్లిలలో శాంపిల్స్ సేకరించి, కెమికల్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. తనిఖీల్లో ఏదైనా కలుపరాని పదార్థాలు కలిపినట్లు తేలితే సదరు దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. మహబూబ్‌నగర్‌లో 17 సొసైటీలు ఉన్నాయని వీటిలో పరిధిలో 500 ఈత చెట్లు ఉన్నాయని ప్రతి రోజు 250 చెట్లకు కల్లు తీస్తారని తెలిపారు. ఒక్కో చెట్టుకు ఐదు లీటర్ల వరకు కల్లు వస్తుందని.. ఎక్కడ కూడా కల్తీ కావడం లేదన్నారు. సమావేశంలో సీఐలు వీరారెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం పనివేళల పొడిగింపు


పుస్తకాలు అందజేస్తున్న రిటైర్డ్ తహసీల్దార్ అద్దంకి యతిరాజాచారి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉద్యోగ నియామకాలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఉదయం ఏడు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఉన్న గ్రంథాలయ పని వేళలను మూడు గంటలు అదనంగా పెంచామని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు బి.రాజేశ్వర్‌గౌడ్ చెప్పారు. సోమవారం జిల్లా గ్రంథాలయానికి రిటైర్డ్ తహసీల్దార్ అద్దంకి యతిరాజాచారి కొన్ని పుస్తకాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ఉదయం ఆరు నుంచి రాత్రి 11 గంటల వరకు జిల్లా గ్రంథాలయం తెరిచే ఉంటుందన్నారు. హన్వాడలోని శాఖ గ్రంథాలయ కొత్త భవనానికి రూ.68 లక్షలు, కోయిల్‌కొండలో కొత్త నిర్మించేందుకు రూ.60లక్షలు మంజూరయ్యాయన్నారు. వెన్నచేడ్ రూ.13.50 లక్షలతో నిర్మించిన కొత్త భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

అమరచింత: ఆత్మకూర్‌లోని భార్గవినగర్‌లో రెండిళ్లలో చోరీ జరిగింది. వెండి, బంగారు అభరణాలతో పాటు నగదు అపహరించారు. ఈ సంఘటన సోమవారం వెలుగుచూసింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు.. భార్గవినగర్‌లో నివాసముంటున్న తిపుడంపల్లి వెంకట్రాంరెడ్డి ఇంట్లో 3వందల గ్రాముల వెండి 6తులాల బంగారు నగలు, రూ.6వేలు నగదు చోరీ చేశారు. అదే కాలనీలో నివాసం ఉంటున్న నాగిరెడ్డి ఇంట్లో సైతం 300 గ్రాముల వెండి, 2తులాల బంగారు నగలు, రూ.5వేల నగదు దోచుకెళ్లారు.

పార్టీ కోసం అందరం కష్టపడుదాం


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ: పార్టీ బాగుంటేనే అందరూ బాగుంటారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని యారోనిపల్లిలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అంతకుముందు కార్యకర్తలు, నాయకులు మంత్రిని ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కళ్ల ముందే రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోవడం సంతోషాన్ని ఇస్తుందన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి కేసీఆర్ బూత్‌స్థాయిలో ఇన్‌చార్జ్‌గా ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారని అన్నారు. అలాంటప్పుడు చిన్నా, పెద్ద అనే తేడాలు లేకుండా అదరం కలిసి పార్టీ కోసం కష్టపడాలన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు, కంటివెలుగు, దళితబంధు తదితర పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్న ఘనత ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజల్లో పార్టీపై మరింత విశ్వసనీయత పెరుగుతుందన్నారు. ఊహించని రీతిలో ప్రభుత్వం చేపడుతున్న పథకాలతో ప్రతిపక్షాలకు దిమ్మ తిరుగుతుందన్నారు. కొనగట్టుపల్లికి జాతీయ స్థాయి అవార్డు రావడం సంతోషదాయకమని అన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని మిగతా గ్రామాలు కూడా అభివృద్ధిలో ముందంజలో ఉండాలన్నారు. అంతకుముందు నాగినోనిపల్లి నుంచి బుద్దారం వరకు రాకపోకలకు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాచకపల్లికి చెందిన సూర్యానాయక్ మృతి చెందగా, ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేల చెక్కును భార్య తులసికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎంపీపీ బాల్‌రాజ్, జెడ్పీటీసీ విజయనిర్మల, వైస్ ఎంపీపీ లక్ష్మి, సింగిల్ వైస్ చైర్మన్ వెంకటయ్య, కరుణాకర్‌గౌడ్, కొండా బాలయ్య, బాలగౌడ్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రెవెన్యూశాఖకు దిక్సూచి భూమి మేనిఫెస్టో

- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి
- భూదాన్ పోచంపల్లిలో భూమి కారవాన్ పాదయాత్ర–2 ప్రారంభం



పాదయాత్రను నిర్వహిస్తున్న ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి: లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్ సొసైటీ (లీఫ్స్) సంస్థ 2014లో రూపొందించిన భూమి మేనిఫెస్టో రెవెన్యూ శాఖకు దిక్సూచి లాంటిదని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి అన్నారు. సోమ వారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని వినోబాభావే మందిరం వద్ద నుంచి లీఫ్స్ ఆధ్వర్యంలో భూమి కారవాన్ పాద యాత్ర–2ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరూప్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రెవెన్యూ రికార్డుల్లోని తప్పులను సరిదిద్దక ముందే డిజిటలైజ్ చేయడం వల్ల రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి కోర్టుల చుట్టూ తిరుగుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ సీనియ ర్ నేత కోదండరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్, ఎండోమెంట్, ఇనాం, వక్ఫ్ భూములను అమ్ముకుంటోందని దుయ్యబట్టారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా గాంధీజీ ఆధ్వర్యంలో నాడు బిహార్‌లోని చంపారణ్‌లో మొదలైన రైతుల ఉద్యమం తరహాలో తెలంగాణలోనూ ఉద్యమం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

జూన్ 2న ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం: లీఫ్స్ అధ్యక్షుడు సునీల్

రెవెన్యూ చట్టాలు, విధానాల్లో చేయాల్సిన మార్పులపై సమగ్ర ప్రణాళిక రూపొందించి జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రభుత్వానికి నివేదిస్తామని లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు, రెవెన్యూ చట్టాల నిపుణుడు ప్రొఫెసర్ సునీల్‌కుమార్ చెప్పారు. అంతకు ముందు ఆచార్య వినోబాభావే, వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన నివాళులు అర్పించారు. వినోబాభావే నడియాడిన జువ్వి చెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం దోతిగూడెంలో రైతులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు.

చట్టాలకు రామోజీ అతీతుడా..!

▶ మొదటి పేజీ తరువాయి

ఫైనాన్షియర్స్ వ్యవహారంలో... ఆ కంపెనీ ద్వారా తాము చేసినవన్నీ చట్ట విరుద్ధమైన పనులే అని తేలటంతో... తప్పును కప్పిపుచ్చుకోవటానికి ఏకంగా ఆ సంస్థనే మూసేశారు. ఇపుడు ఆ సంస్థే లేదు కదా? అని వాదిస్తున్నారు. ఒక బ్యాంకు తన వద్దకు వచ్చిన డిపాజిట్లను ఇష్టం వచ్చినట్లు సొంత అవసరాల కోసం వాడేయొచ్చా? సొంత కంపెనీల్లోకి మళ్లించొచ్చా? అలా మళ్లిస్తే బ్యాంకు కుప్పకూలిపోదా? కృషి, చార్మినార్, ప్రుడెన్షియల్ బ్యాంకుల నుంచి బిచాణా ఎత్తేసిన బ్యాంకులన్నీ ఇలా చేసినవే కదా?

మార్గదర్శి చిట్స్‌లో ప్రస్తుతం వేలకోట్ల రూపాయల మనీ లాండరింగ్, అక్రమ నిధుల మళ్లింపు జరుగుతున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరుపుతోంది. నిజాలు బయటికొస్తున్నాయి. కానీ దీన్ని ఈ నిజాలు వెలుగుచూడకుండా 86 ఏళ్ల రామోజీరావు కొత్త నాటకానికి తెరతీశారు. 'ఈనాడు' పత్రికను అడ్డంపెట్టుకుని, తటస్థుల ముసుగులో తన వాళ్లను తెరపైకి తెస్తున్నారు. అడ్డగోలు బుకాయింపులకు దిగుతున్నారు. మార్గదర్శిపై ఏ ఒక్క ఫిర్యాదూ రాలేదు కదా? అలాంటపుడు సీఐడీ విచారణ ఎందుకంటున్నారు. 'ఈనాడు' పత్రికలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు వస్తున్నందుకే ప్రభుత్వం కక్ష గట్టి ఇలా చేస్తోందని... తన వాళ్లచేత కేంద్రానికి లేఖలు కూడా రాయిస్తున్నారు.

ఇక్కడ మార్గదర్శిలో చిట్లు వేస్తున్నవారు, డిపాజిటర్లు గమనించాల్సింది ఒక్కటే. యావత్తు దేశాన్ని కుదిపేసి దివాలా తీసిన శారదా చిట్‌ఫండ్స్‌గానీ, వేల మందిని ముంచేసిన సుదర్శన్ చిట్స్ గానీ కూలిపోవటానికి ముందు చాలా బలంగా కనిపించినవే కదా? కూలిపోయేదాకా వాటిపై ఎవ్వరూ ఎలాంటి ఫిర్యాదులూ చేయలేదే!!. ఎవ్వరూ ఫిర్యాదు చేయకపోబట్టే... చట్టాలు ఉల్లంఘిస్తున్నా అక్కడి ప్రభుత్వాలు పట్టించుకోకపోవటం వల్లే అవి కుప్పకూలాయి. వేల మంది దాచుకున్న కష్టార్జితాన్ని స్వాహా చేసేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో మార్గదర్శి చిట్స్‌ను... చట్టప్రకారం నడుచుకోవాలని కోరటం తప్పా? చట్టాలను అనుసరించాలని అడగటం నేరమా? ఇదెక్కడి తీరు!!.

అయినా డిపాజిట్లు సేకరించకూడదన్న ఆర్‌బీఐ నిబంధనల్ని ఉల్లంఘించినందుకు ఎన్ని ఎన్‌బీఎఫ్‌సీలు మూతపడలేదు? కనీసం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎన్‌బీఎఫ్‌సీ కూడా కాదు. ఒక 50 మంది చిట్ సభ్యులుంటే... ప్రతినెలా ప్రతి ఒక్కరి దగ్గరా సొమ్ములు వసూలు చేసి.. వాటిని చిట్ పాడుకున్న ఎవరో ఒక్కరికి ఆ నెల్లోనే ఇవ్వటం దాని పని. మరి ప్రతినెలా అలా ఎవరి చిట్ల డబ్బులు వాళ్లకు ఇచ్చేస్తున్నపుడు వేల కోట్ల రూపాయల మిగులు మొత్తాలు దానిదగ్గర ఎలా ఉంటాయి? వాటిని తన సొంత సంస్థల్లోకి మళ్లించే అధికారం ఎవరిచ్చారు? వాటిని స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్‌చేసే అధికారం ఎక్కడి నుంచి వచ్చింది? ఇవన్నీ ఉల్లంఘనలు కావా?

పత్రికాధిపతి... వ్యాపారవేత్త అనే రెండు టోపీల్ని రామోజీరావు ధరిస్తుంటారని... వ్యాపారాల్లో అక్రమాలేవైనా బయటపడినపుడు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోబోయినపుడల్లా... అది పత్రికా స్వేచ్ఛపై దాడి అంటూ ఎదురుదాడికి దిగుతారని సాక్షాత్తూ ఈ దేశ సర్వోన్నత న్యాయస్థానమే గతంలో చెప్పింది. గతమంతా రామోజీ చేసింది ఇదే. కాకపోతే ఇపుడలా మాటలు పనిచేయటం లేదు. నమ్మేవారెవరూ లేరు. దీంతో ఆ మాటలు తాను చెప్పకుండా... తటస్థుల ముసుగులో తనకు కొమ్ముకాసే కొందరితో చెప్పిస్తున్నారు. అయినా అక్రమాలు చేస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై చర్యలు తీసుకుంటుంటే మధ్యలో ఈ తటస్థులెవరు? వీళ్లేమైనా మార్గదర్శిలో చిట్లు వేస్తున్నవారా? వీళ్లకేం సంబంధం? వీళ్లకసలు అక్రమాలకు పాల్పడుతున్న రామోజీని రక్షించే బాధ్యతను ఎవరిచ్చారు? రామోజీరావా... చంద్రబాబు నాయుడా?

ఈ చట్టాలు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాదే?

కేంద్ర చిట్‌ఫండ్ చట్టం–1982, రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం–1999లను ఉల్లంఘించి నిధులు మళ్లించినట్టు, అక్రమ డిపాజిట్లు సేకరించినట్టు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ సోదాల్లో ఆధారాలతో సహా వెల్లడైంది. చందాదారులు, డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆ శాఖ అధికారుల ఫిర్యాదుతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. దీన్ని వక్రీకరిస్తూ రామోజీరావు మీడియా, చంద్రబాబు పార్టీ గగ్గోలు పెడుతున్నాయి. నిజానికి ఈ రెండు చట్టాలూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసినవేమీ కావు. చిట్‌ఫండ్ చట్టాన్ని కేంద్రం 1982లో రూపొందించింది. ఇక ఏపీ డిపాజిటర్ల హక్కుల పరిరక్షణ చట్టాన్ని తెచ్చింది 1999లో చంద్రబాబు ప్రభుత్వమే. వాటిని అమలు చేస్తుంటే... దాన్ని రామోజీరావుపై వేధింపులుగా వక్రీకరిస్తున్నారు.

చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘిస్తే ఆ తరవాత దివాలాయే!!

చిట్‌ఫండ్ చట్టాన్ని, డిపాజిటర్ల చట్టాన్ని ఉల్లంఘిస్తే ఏమవుతుందన్నట్టుగా రామోజీరావు, ఆయన మనుషులు, టీడీపీ ప్రజల్ని తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నాయి. సామాన్యుల డబ్బు భద్రంగా ఉండటం కోసం చేసిన ఆ చట్టాలను ఉల్లంఘిస్తే ఏమవుతుందో... దేశంలో బట్టబయలైన ఎన్నో చిట్‌ఫండ్ కుంభకోణాలు, ప్రైవేట్ బ్యాంకుల ఆర్థిక దోపిడీలు నిరూపించాయి కూడా...

శారదా చిట్‌ఫండ్... 4.90 లక్షల కోట్ల భారీ దోపిడీ

2013లో బట్టబయలైన శారదా చిట్‌ఫండ్ కుంభకోణం దేశంలోనే సంచలనం సృష్టించింది. పశ్చిమ బెంగాల్, అసోం, త్రిపురలలో డిపాజిట్‌దారుల నుంచి ఏకంగా 4.90 లక్షల కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించింది. అధికవడ్డీల ఆశ చూపించి పోంజీ తరహా మోసానికి పాల్పడింది. 2013లో శారదా చిట్‌ఫండ్ సంస్థ బోర్డు తిప్పేయడంతో ఏకంగా 17 లక్షల మంది ఆ సంస్థ ఖాతాదారులు నిండా మోసపోయారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కూడా పోంజీ తరహా మోసానికే పాల్పడుతోందని స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ సోదాల్లో వెల్లడి కావడం గమనార్హం.

రూ. 6,380 కోట్ల అగ్రిగోల్డ్ కుంభకోణం

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో వెలుగుచూసిన మరో ఆర్థిక మోసం అగ్రిగోల్డ్. గొలుసుకట్టు తరహాలో 8 రాష్ట్రాల్లో ఏకంగా రూ.6,380 కోట్ల డిపాజిట్లు సేకరించింది. అందులో రూ.3,996 కోట్ల డిపాజిట్లు ఆంధ్రప్రదేశ్‌లో సేకరించినవే. ఇష్టం వచ్చినట్లుగా నిధుల్ని మళ్లించి సంస్థ బోర్డు తిప్పేసింది. ఫలితం... కష్టార్జితాన్ని దాచుకున్న 32 లక్షల మంది డిపాజిట్‌దారులు రోడ్డునపడ్డారు. వారిలో అత్యధికంగా 19.50 లక్షలమంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే. అగ్రిగోల్డ్ సంస్థ అక్రమాలకు పాల్పడుతోందని గుర్తించినా నాటి చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆ సంస్థకు చెందిన హాయ్‌లాండ్‌తోపాటు అమరావ తిలో భూములను కొల్లగొట్టేందుకే చంద్రబాబు, లోకేశ్ ప్రాధాన్యమిచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చాక దశల వారీగా డిపాజిటర్లకు చెల్లింపులు చేస్తూ వస్తోంది.

పాతికేళ్ల కిందటే... 'కృషి' బ్యాంకు

చంద్రబాబు సీఎంగా ఉండగా 2001లో కృషి బ్యాంకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఖాతాదారులను బురిడీ కొట్టించింది. అత్యధిక వడ్డీల ఆశ చూపించిన ఈ బ్యాంకు చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు... రూ.35 కోట్ల డిపాజిట్లను కొల్లగొట్టారు. అనధికారిక లెక్కల ప్రకారం ఈ డిపాజిట్లు రూ.100 కోట్లకుపైనే ఉంటాయని సమాచారం. కొసరాజు ఆ నిధులను ఇతర సంస్థల్లోకి అక్రమంగా మళ్లించి చివరికి 2001లో చేతులెత్తేసి విదేశాలకు పారిపోయాడు.

ప్రుడెన్షియల్... పాపులర్.. ఏదైనా అంతే..

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే 2003లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో వెలుగు చూసిన మరో భారీ ఆర్థిక మోసం... ప్రుడెన్షియల్ బ్యాంకు. ఏకంగా రూ.550 కోట్ల మేర డిపాజిట్‌దారులను మోసం చేసింది ఆ సంస్థ. ఇక కేరళ కేంద్రంగా డిపాజిట్లు సేకరించిన పాపులర్ ఫైనాన్స్ సంస్థ ఏకంగా రూ.2వేల కోట్లమేర డిపాజిటర్లను మోసం చేసింది. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో 274 బ్రాంచ్‌లతో కార్యకలాపాలు సాగించిన ఈ సంస్థ 2022లో బోర్డు తిప్పేసి డిపాజిటర్లను ముంచేసింది.

వీటన్నింటినీ మించిపోయిన మార్గదర్శి...

పైన పేర్కొన్న సంస్థలను తలదన్నే రీతిలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతోందని ఆధారాలతో సహా వెల్లడైంది. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లలో మార్గదర్శి చిట్స్ కార్యాలయాల్లో నిర్వహించిన సోదాల్లో ఈ అక్రమాలు వెలుగుచూశాయి. అనంతరం సీఐడీ అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన సోదాల్లోనూ ఈ అక్రమాలు ధ్రువపడ్డాయి.

■ **రశీదు ముసుగులో అక్రమ డిపాజిట్లు:** చందాదారులు పాడిన చిట్ మొత్తాన్ని వారికి వెంటనే చెల్లించడం లేదు. ఆ మొత్తంపై 4 నుంచి 5 శాతం వరకు వడ్డీ చెల్లిస్తామని చెబుతూ ఓ రశీదు ఇస్తున్నారు. అంటే మార్గదర్శి సంస్థ ఆ చిట్ మొత్తాన్ని డిపాజిట్‌గా స్వీకరిస్తోంది. ఇది రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధం. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు స్వీకరించడం నేరం. మార్గదర్శి చిట్స్ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా 'ప్రత్యేక రశీదు' ముసుగులో డిపాజిట్లు సేకరిస్తోంది. ఈ అక్రమ డిపాజిట్లు ఎన్ని వేల కోట్లు అన్నది లెక్కతేలాల్సి ఉంది.

■ **గతంలో రూ.15వేల కోట్ల అక్రమ డిపాజిట్ల సేకరణ:** మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట అక్రమ డిపాజిట్లు సేకరించిన నేర చరిత్ర మార్గదర్శి గ్రూపునకు ఉంది. గతంలో అక్రమంగా సేకరించిన రూ.15వేల కోట్ల డిపాజిట్లపై ఆదాయపన్ను చెల్లించాలని ఆదాయపన్ను శాఖ నోటీసులు కూడా ఇచ్చింది. దాంతో హడావుడిగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను మూసేశారు. కేసు దర్యాప్తులో ఉండగా సంస్థను మూసివేయడం అంటే ఆధారా లను ధ్వంసం చేయడమే. అది క్రిమినల్ నేరం.

■ **చందాదారుల సొమ్ము సొంత పెట్టుబడిగా...:** మార్గదర్శి చిట్స్‌కు మూడు అనుబంధ కంపెనీలున్నట్టుగా బ్యాలెన్స్ షీట్లో పేర్కొన్నారు. మార్గదర్శి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్–చెన్నై, మార్గదర్శి చిట్స్ (కర్ణాటక) ప్రైవేట్ లిమిటెడ్–బెంగళూరు, ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్– హైదరాబాద్‌లను అనుబంధ కంపెనీలుగా చూపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లించడానికే ఈ కథ. ఒక్క ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లోనే 88.5 శాతం వాటాకోసం పెట్టుబడి పెట్టినట్టు నిర్ధారణ అయ్యింది. అంటే రామోజీరావు కుటుంబం రూపాయి పెట్టకుండా...చందాదారుల సొమ్ముతోనే సొంత వ్యాపారాలు చేస్తున్నారు. అసలు చిట్‌ఫండ్ కంపెనీలు ఇతర వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టడం చిట్ ఫండ్ చట్టం–1982కు విరుద్ధం.

■ మార్గదర్శి చిట్స్ కార్యాలయాల నుంచి భారీగా నిధులను మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ నిధులను మార్గదర్శి యాజమాన్యం మార్కెట్ రిస్క్ అత్యధికంగా ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెడుతోంది. ఇది చిట్ ఫండ్ చట్టానికి విరుద్ధం.

■ **రికార్డుల కనికట్టు...:** చట్ట విరుద్ధంగా చేస్తున్న ఈ మోసాన్ని కప్పిపుచ్చేందుకు మార్గదర్శి చిట్స్ రికార్డుల్లో భారీ అవకతవకలకు పాల్పడుతోంది. చందాదారుల సొమ్ము చెక్కుల రూపంలో తమ వద్ద ఉన్నట్టుగా బ్యాలెన్స్‌షీట్‌లో చూపిస్తోంది. ఏటా మార్చి 31న వందల కోట్ల రూపాయలు చెక్కులు వచ్చినట్టు చూపిస్తోంది. కానీ ఆ చెక్కులు ఎన్నిరోజులైనా క్యాష్ కావు. అంటే... అవి బోగస్ చెక్కులన్నమాట. అప్పటికే ఆ సొమ్మును మనీ లాండరింగ్ చేసేశారన్నది స్పష్టంగా తెలియకమానదు.

■ **ఏపీ ప్రజల సొమ్ము... పెత్తనం పక్క రాష్ట్రంలో:** రాష్ట్రంలో మార్గదర్శి చిట్స్‌కున్న 37 బ్రాంచ్‌ల్లో ఏడు బ్రాంచిల్లో చందాదారులు చెల్లించిన మొత్తం అక్కడి బ్యాంకుల్లో లేదు. ఆ సొమ్మంతా నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించేస్తున్నారు. రాష్ట్రంలోని మార్గదర్శి ఫోర్‌మెన్‌కు చట్ట ప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తో సహా ఎలాంటి అధికారాలూ లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి ఎండీ శైలజతో పాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది. ఇక్కడి చందాదారుల సొమ్ము భద్రత గురించి అడిగితే తనకు తెలియదని ఫోర్‌మెన్ చెబుతున్నారు. హైదరాబాద్ వెళ్లి అడిగితే... తెలంగాణలో ఉంది కనక అది ఏపీ అధికారుల పరిధిలోకి రాదని చెబుతున్నారు. మరీ

నిధులు మళ్లించామని అంగీకరించిన రామోజీ

సీఐడీ దర్యాప్తులో... తాము మార్గదర్శి చిట్స్ నిధులను ఇతర సంస్థలకు మళ్లించామని రామోజీరావే అంగీకరించారు. ఆధారాలతోసహా సీఐడీ అధికారులు ప్రశ్నించేసరికి ఆయన నోటమాట రాలేదు. దాంతో నిధులు మళ్లించింది వాస్తవమేనని అంగీకరిస్తూనే అది తమ ఆర్థిక ప్రణాళిక అన్నట్టుగా బుకాయించేందుకు ప్రయత్నించారు. ఈ కేసులో ఏ–1గా ఉన్న రామోజీరావే అక్రమాలు నిజమేనని సమ్మతించిన తరువాత ... మళ్లీ వక్రీకరిస్తూ వితండవాదనలెందుకు?

చట్టాలు తమకు వర్తించవన్న శైలజ...

మామ కంటే రెండు ఆకులు ఎక్కువ చదివానన్నట్టుగా ఏ–2 చెరుకూరి శైలజ వ్యవహరించారు. అసలు చిట్‌ఫండ్ చట్టం తమకు వర్తించదని...తాము పట్టించుకోమని ఆమె సీఐడీ అధికారుల వద్దే వ్యాఖ్యానించడం తీవ్రమైన అంశమని నిపుణులు చెబుతున్నారు. కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నామన్న ఆమె... పోనీ ఆ చట్ట ప్రకారమైనా అనుబంధ కంపెనీలకు నిధులు మళ్లించడం నేరమే కదా అని అంటే మాత్రం సమాధానమివ్వలేదు.

ఏపీ చందాదారుల సొమ్ముకు బాధ్యులెవరని అడిగితే... సమాధానం లేదు.

■ **ఒక్క బ్యాంకు ఖాతా చాలట...:** చిట్‌ఫండ్ సంస్థలు తాము నిర్వహించే ప్రతి చిట్టీకీ సంబంధిత బ్యాంకు ఖాతా వివరాలివ్వాలి. మార్గదర్శి దీన్ని పట్టించుకుంటే ఒట్టు. అన్ని చిట్లకూ ఒకే బ్యాంకు ఖాతా. ఏపీకి సంబంధించి ప్రత్యేక ఖాతా కూడా లేదు.

■ ఇదో పోంజీ తరహా స్కామ్: మార్గదర్శి చిట్స్ పోంజీ స్కీమ్‌కు తక్కువేమీ కాదు. చిట్టీల్లో 30 – 40% టికెట్లు (సభ్యత్వాలు) యాజమాన్యానివే. వాటికి తన తరపున చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. కొత్త చిట్లు, ఇతర చిట్ల నుంచి వచ్చిన సొమ్మును తాము చెల్లించినట్టుగా రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. అంటే... ఏ రోజైనా కొత్తగా వచ్చే చందాదారులు తగ్గినా, కొత్త చిట్లు ఆగినా మార్గదర్శి తన తరపున చెల్లించాల్సిన చందాను చెల్లించే పరిస్థితి ఉండదు. అప్పుడు చిట్ పాడుకున్నవారికి సొమ్ము చెల్లించే అవకాశమూ ఉండదు. అదేరోజున దివాలా తీసే ప్రమాదం ఉంటుంది.

ఒక్క రూపాయి చెల్లించకుండా...తమపేరిట చిట్టీలు

సాధారణంగా ప్రతి చిట్‌కూ నిర్ణీత చందాదారుల సంఖ్య ఉంటుంది. కొన్ని గ్రూపుల్లో తక్కువ మంది సభ్యులు (టికెట్లు) చేరితే కొన్ని ఖాళీగా ఉండిపోతాయి. ఆ ఖాళీ టికెట్స్‌ను కంపెనీ తీసుకోవాలి. వాటి చందాను కంపెనీ చెల్లించాలి. తరవాత కొత్త చందాదారులు చేరితే ఆ మేరకు టికెట్స్ భర్తీ చేయొచ్చు. చిట్‌ఫండ్ చట్టంలోని ఈ నిబంధనలను మార్గదర్శి ఏనాడూ పట్టించుకోలేదు. గరిష్ఠంగా ఒకో గ్రూపులో 50 శాతం వరకూ టికెట్లు కంపెనీవే ఉన్నాయి. వాటికోసం మార్గదర్శి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. చిట్లపై తమకు వచ్చే డిస్కౌంట్ల మొత్తాన్ని డూప్లికేట్ చేసి అన్నిచోట్లా రికార్డుల్లో చూపిస్తోంది.

తెలుగు సాహితీ ఉత్సవాల్లో జిల్లా కవులు



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో సాహిత్య అకాడమీ సౌజన్యంతో శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ ఉత్సవాల్లో జిల్లాకు చెందిన కవులు ఖాజా మైనద్దీన్, వై.దేవదానం, నందిగామ కిషోర్, సుంకరి బసవరాజప్పలు పాల్గొన్నారు. కవి సమ్మేళనంలో వీరు తమ కవితాగానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కవులను నిర్వాహకులు ఘనంగా సన్మానం చేశారు.

రేపు జాబ్‌మేళా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హెచ్‌సీఎల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్‌బీ కోసం ఈనెల 12న జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా ఉంటుందని డీఐఈఓ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23లో ఎంపీసీ లేదా ఎంఈసీ పూర్తి చేసి, 60శాతం మార్కులు కలిగిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన వారు పదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం మెమోలు, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటో ఆండ్రాయిడ్ ఫోన్‌తో హాజరుకావాలని, పూర్తి వివరాలకు సెల్ నం. 8317638406, 9014600354కు సంప్రదించవచ్చని తెలిపారు.

వ్యాపార దుకాణాలు దగ్ధం

బిజినేపల్లి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు అనుకుని ఉన్న మూడు వ్యాపార దుకాణాలు విద్యుదాఘాతానికి గురై దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు రాపిడికి గురై షార్ట్‌సర్క్యూట్ చోటుచేసుకుని మూడు వ్యాపార దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో తిరుపతిరెడ్డి, మధు, టైర్‌పాషలకు చెందిన సుమారు రూ.6 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి బాధితులకు ఆర్థిక సాయం అందజేసి, వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



ప్రజాసేవ కోసమే ఉద్యోగం వదులుకున్నా

- ఎన్నికలప్పుడు వచ్చే నాయకులను నమ్మకండి
- బీఎస్పీతోనే గ్రామాల్లో అభివృద్ధి ఫలాలు
- రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



పచ్చర్లలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

రాజోళి: ప్రజా సేవ చేయడం కోసమే తాను ఉద్యోగం వదులుకున్నానని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వారి మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సోమవారం మండలంలోని పచ్చర్ల, మాన్‌దొడ్డి, నసనూర్, చిన్నధన్వాడ, పెద్దధన్వాడ గ్రామాల్లో రాజ్యాధికార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లోని ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలకు రోగాలు వస్తున్నా.. పట్టించుకునే వారు లేక ఎంతో మంది మంచానికే పరిమితమవుతున్నారన్నారు. ఒక్క పచ్చర్లలోనే 35 మందికి పక్షవాతం రాగా, మరికొంత మంది లివర్ వ్యాధితో బాధపడుతున్నారని, కానీ, కేసీఆర్ ప్రభుత్వం మాత్రం తమకేమీ పట్టదన్నట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. వైద్యులు కావాల్సిన విద్యార్థులు చదువు ఆపేసి, మంచాన పడిన తమ కుటుంబ సభ్యులకు సేవలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజోళిలో ఎస్సీలు చనిపోతే, వారిని పూడ్చిపెట్టేందుకు స్థలం లేదని విమర్శించారు. గ్రామాలకు వచ్చే రహదారులు గుంతలమయంగా ఉన్నాయని, మరుగుదొడ్లు లేక, బహిర్భూమికి చీకట్లో బయటకు వెళ్తున్నారని, చీకట్లో జరిగే ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఏళ్లతరబడి అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీలు.. రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ కూడా కేవలం తమ పబ్బం గడుపుకొనేందుకు, స్వార్థ రాజకీయాలకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాల అమలులో కూడా ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని, నిజమైన పేదలకు న్యాయం జరగడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ఓటేసి, బీఎస్పీని అధికారంలోకి తెస్తే నాణ్యమైన విద్య, వైద్యం అందించి, పూర్తిస్థాయిలో ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకే అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేశవరావ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కేసీఆర్ ఆగం చేసిండు

మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: మిగులు నిధులతో ఏర్పాడిన తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేసి ఆగం చేశాడని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో నాగం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని, సాక్షాత్తు దేశ ప్రధాన మంత్రి మోదీ చెప్పడం చూస్తుంటే ఏ మేర ప్రజాధనం బీఆర్‌ఎస్ నాయకులు దోచుకున్నారో అర్థం చేసుకోవాలని చెప్పారు. ఇంత అవినీతి జరుగుతుంటే బాధ్యత గల ప్రధాని విచారణ జరపకుండా ఏం చేస్తురో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ,బీజేపీ ఒకటే అనే దానికి ఈ ఘటనలే నిదర్శనమన్నారు. నాయకత్వ బాధ్యతలు ఇస్తే దేశంలోని పార్టీలకు ఫండింగ్ ఇస్తామని బీఆర్‌ఎస్ నేతలు బాహాటంగా చెప్పడం చూస్తేంటే ఆశ్చరంగా ఉందన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, మరోసారి బీఆర్‌ఎస్ దొంగలకు రాష్ట్రాన్ని పాలించే అవకాశం ఇస్తే తెలంగాణను అమ్మేసుకుంటారని విమర్శించారు. మార్కండేయ ప్రాజెక్టు భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా వారిని ఊర్లో నుంచి వెళ్లగొట్టే కుట్ర జరుగుతోందని, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కనుసన్నల్లోనే అమాయక రైతులను, దళితులను పోలీసులతో వేధిస్తున్నారని ఆరోపించారు. ముంపు గ్రామాల ప్రజలకు న్యాయపరమైన పరిహారం ఇచ్చి న్యాయం చేసే వరకు వారికి అండగా ఉంటామని చెప్పారు. దోపిడీ దొంగల పాలనలో తెలంగాణ మగ్గిపోతుందని, బీఆర్‌ఎస్ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ అంశం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే బండిసంజయ్ అంశాన్ని ప్రభుత్వం తెరపైకి తెచ్చిందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు అర్థం రవి, బాలగౌడ్, లక్ష్మయ్య, హైమద్ పాల్గొన్నారు.

అత్యద్భుతం త్యాగరాజ కీర్తనలు



ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి తదితరులు

అమరచింత: మరుపురాని విధంగా సద్గురు త్యాగరాజ స్వామి సంకీర్తనలు ఉంటాయని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్ పట్టణంలో సోమవారం త్యాగరాజ స్వామి రెండో ఆరాధన మహోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీనాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో నిర్వహించిన సంగీత ఉత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు హాజరుకావడం సంతోషకరమని అన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వాయిద్యా కళాకారులను సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ శ్రీధర్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్ రెడ్డి, హనుమంతు, వెంకటేష్, శ్రీనివాసులు, సాగర్ సంతోష్, విష్ణు, రాజు, శ్రీకాంత్, నరసింహ పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలతో యువకుడి హత్య?

హతుడికి నెలక్రితమే వివాహం



నరేష్ (ఫైల్)

బిజినేపల్లి: ఆస్తి కోసం సొంత అన్న తమ్ముడిని హతమార్చాడు. ఆదివారం తిమ్మాజిపేట మండలంలోని ఆవంచలో చోటుచేసుకున్న ఈ సంఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మయ్యకు లక్ష్మమ్మ, మల్లమ్మలు అనే ఇద్దరు భార్యలు ఉన్నారు. లక్ష్మయ్య ఆరేళ్ల క్రితమే మృతిచెందగా.. ఇద్దరు భార్యల కుమారుల మధ్య కొంతకాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం గ్రామ సమీపంలోని దుందుభీ వాగులో పెద్ద భార్య లక్ష్మమ్మ కుమారుడు శేఖర్, అతని స్నేహితులు కలిసి విందు చేసుకుంటున్నారు. ఈ విందులో చిన్న భార్య కుమారుడు నరేష్(23) కూడా ఉన్నాడు. వీరంతా కొద్దిసేపు కల్లు తాగుతూ సరదాగా గడిపారు. తర్వాత శేఖర్, నరేష్‌ల మధ్య ఆస్తి విషయంలో గొడవ జరగగా.. శేఖర్ అతని స్నేహితులు నరేష్‌ని తీవ్రంగా గాయపర్చి చంపారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి నరేష్ కనిపించడం లేదని తల్లి మల్లమ్మ, భార్య కృష్ణవేణి గ్రామస్తులను ఆరా తీశారు. నరేష్, శేఖర్ మరి కొంత మంది స్నేహితులతో కలిసి వాగులో విందు చేసుకున్నారని చెప్పడంతో సోమవారం ఉదయం వాగు సమీపంలో వెతికారు. అక్కడే నరేష్ చనిపోయి కనిపించాడు. నరేష్ మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, శేఖర్ అతని స్నేహితులు కొట్టి చంపి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. కాగా.. నరేష్‌కు గత నెల మార్చి 9న వివాహం జరిగింది. నెల రోజుల్లోనే నరేష్ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై శేఖర్, శ్రీశైలం, బాలరాజు, ఈశ్వర్‌లపై అనుమానం ఉన్నట్లు నరేష్ తల్లి మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ శంషొద్దీన్ తెలిపారు.

1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో సోమవారం 1,020 అడుగుల మేర నీటిమట్టం ఉంది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని పది రోజులుగా నిలిపివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

జహంగీర్ బాషను కాపాడాలి

శాంతినగర్: అలంపూర్ ఎస్‌ఐ మహేందర్, శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ యంకప్ప వల్ల శాంతినగర్‌కు చెందిన జహంగీర్ బాషకు ప్రాణహాని ఉందని, అతన్ని కాపాడాలని కోరుతూ రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ సోమవారం జిల్లా ఎస్పీ సృజనకు ఫిర్యాదు చేశారు. గతంలో ఎస్‌ఐ శాంతినగర్‌లో 2017లో పనిచేసే సమయంలో గణేష్ ఉత్సవాలకు మైక్‌సెట్ సరఫరా చేశారనే విషయమై జహంగీర్ బాషను కర్రలతో దాడిచేసి కొట్టారు. దీంతో అతని చెవి పనిచేయడం లేదు. ఈ విషయమై పోలీసులకు అప్పట్లో ఫిర్యాదుచేశారు. పట్టించుకోకపోవడంతో కోర్టులో కేసు వేశారు. దీంతో ప్రస్తుతం అలంపూర్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ మహేందర్, శాంతినగర్ కానిస్టేబుల్ యంకప్ప చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, వెంటనే వారిని సస్పెండ్ చేసి జహంగీర్ బాషను కాపాడాలని ఎస్పీని కోరారు. స్పందించిన ఎస్పీ శాఖాపరమైన విచారణ జరుపుతామని హామీ ఇచ్చినట్లు గడ్డం లక్ష్మణ్ తెలిపారు. ఆయన వెంట పౌరహక్కుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు సుభాన్, ప్రధాన కార్యదర్శి బాలయ్య ఉన్నారు.



దుఃఖాన్ని దిగమింగి పరీక్షకు..



పదో తరగతి పరీక్ష రాసి వస్తున్న మురళీకృష్ణ

గండేడ్: తల్లి చనిపోయి దుఃఖంలో ఉన్న పదో తరగతి విద్యార్థి, బంధువులు, ఉపాధ్యాయులు సముదాయించడంతో పరీక్షకు హాజరయ్యాడు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం మల్‌రెడ్డిపల్లిలో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. మల్‌రెడ్డిపల్లికి చెందిన పాపాకంటి మురళీకృష్ణ వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి వరకు చదువుతున్నాడు. తల్లి పాపాకంటి లక్ష్మమ్మ (35) టిఆర్‌ఎస్ తరపున 3వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆమె అకస్మాత్తుగా ఆదివారం రాత్రి 9గంటల ప్రాంతంలో గుండెపోటుతో మృతి చెందింది. అంజిలయ్య, లక్ష్మమ్మకు ఒక్కగానొక్క కుమారుడు ఇతనే. తల్లి చనిపోవడంతో రాత్రంతా ఏడ్చాడు. పుస్తకం పట్టలేదు. దీంతో పరీక్ష రాయలేను అని చెప్పాడు. కానీ తోటి విద్యార్థులు, బంధువులు, ఉపాధ్యాయులు నచ్చజెప్పడంతో పరీక్ష రాసి వచ్చి, అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.